క్లుప్తంగా

సీపీని కలిసిన చేర్యాల సీఐ



సీపీకి మొక్క అందిస్తున్న సీఐ సత్యనారాయణరెడ్డి

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన పి.సత్యనారాయణరెడ్డి మంగళవారం పోలీస్ కమిషనర్ శ్వేతను కమిషనర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీపీకి మొక్కను అందజేశారు. సర్కిల్ పరిధిలో శాంతి భద్రతలకు ఎలాంటి భంగం కలగకుండా విధులు నిర్వహించాలని, ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలు తీర్చాలని సీఐకి సీపీ సూచించారు.

పిల్లలకు బాలక్క భరోసా



పుట్టినరోజు వేడుకల్లో వికాస పిల్లలు

హుస్నాబాద్: పట్టణంలోని ఆర్యవైశ్య భవన్‌లో మంగళవారం బాల వికాస సంస్థ ఆధ్వర్యంలో అనాథ పిల్లల పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పిల్లలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత మాట్లాడుతూ.. వికాస పిల్లలకు భరోసాగా బాలక్క ఉంటుందన్నారు. ఎంతో మంది అనాథ పిల్లలను చేరదీస్తూ అన్ని తానై సేవలు అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్ చిత్తారి పద్మ, బాల వికాస ప్రోగ్రాం డైరెక్టర్ లత, బాల వికాస వాటర్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేడం లింగమూర్తి, డైరెక్టర్లు అయిలేని మల్లికార్జున్‌రెడ్డి, వరయోగుల శ్రీనివాస్, చందు, వెన్న రాజు, బాల వికాస కో-ఆర్డినేటర్లు జ్యోతి, నిర్మల, శ్రీమతి పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతమే ధ్యేయం

వర్గల్(గజ్వేల్): బీజేపీ బలోపేతమే ధ్యేయంగా పార్టీ శ్రేణులు ముందుకు సాగాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంబటి బాలేశ్‌గౌడ్ అన్నారు. మంగళవారం జిల్లా అధికార ప్రతినిధి నందన్‌గౌడ్ ఆధ్వర్యంలో వర్గల్ మండలం జబ్బాపూర్, నెంటూరు తదితర గ్రామాల్లో పార్టీ కార్నర్ సమావేశం నిర్వహించారు. అనంతరం జెండావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా బాలేశ్‌గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు ఎండగడుతూ, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యవంతులను చేయాలన్నారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్‌గౌడ్, మండల అధ్యక్షుడు శ్రీకాంత్, జిల్లా నాయకులు కుడిక్యాల రాములు, ఎల్కంటి సురేశ్, మహిపాల్‌యాదవ్, మహేశ్, రవీందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


ముదిరాజ్‌ల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి



బండ ప్రకాశ్‌తో కొట్టాల యాదగిరి, తదితరులు

గజ్వేల్‌రూరల్: ముదిరాజ్‌ల సమస్యల పరిష్కారానికి శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాశ్‌ముదిరాజ్‌కు నాచారంగుట్ట ఆలయ పాలకవర్గ మాజీ చైర్మన్ కొట్టాల యాదగిరి ముదిరాజ్ విన్నవించారు. శాసన మండలి డిప్యూటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన బండ ప్రకాశ్‌ను మంగళవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కొట్టాల యాదగిరి మాట్లాడుతూ.. ముదిరాజ్ మత్స్యకార సొసైటీలను త్వరితగతిన రిజిస్ట్రేషన్లు చేయాలని, మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపాలన్నారు. అదే విధంగా ముదిరాజ్‌లకు నామినేటెడ్ పోస్టుల్లో అవకాశం కల్పించడంతో పాటు వారు ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందేలా చూడాలని వారు కోరారు. కార్యక్రమంలో ములుగు మండల ముదిరాజ్ సంఘం నాయకులు మల్లేష్, సదేశ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అంధత్వ నివారణే లక్ష్యం



వృద్ధురాలికి అద్దాలు అందిస్తున్న ప్రతాప్‌రెడ్డి, నాయకులు

మర్కూక్(గజ్వేల్): అంధత్వ నివారణే లక్ష్యంగా ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపడుతుందన్నారు. మంగళవారం మండలంలోని గణేశ్‌పల్లి గ్రామంలో సర్పంచ్ మంజుల శ్రీరాములు ఆధ్వర్యంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ పాండుగౌడ్, వైస్ ఎంపీపీ బాల్‌రెడ్డి, ఎంపీటీసీ నరేందర్, వైద్యసిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయం

ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు

దుబ్బాకరూరల్: అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ ముందుకెళ్తున్నారని ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. దుబ్బాక మండలంలోని నర్లెంగడ్డలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని మంగళవారం ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిలతో కలిసి మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమైక్య పాలనలో రైతులు వ్యవసాయం చేద్దామంటే భయపడేవారని, యాసంగిలో వరిసాగు చేసే వారుకాదని గుర్తు చేశారు. బీడు భూములన్నీ సాగులోకి రావాలని గోదావరి నుంచి కాల్వల ద్వారా నీళ్లు తెచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. రైతులకు ఉచిత కరెంట్, రైతుబంధు, రైతుబీమా పథకాలను అమలు చేస్తూ రైతుబాంధవుడిగా నిలుస్తున్నారన్నారు. మంచినీళ్ల కోసం మహిళలు బిందెలు పట్టుకొని బయటకు వెళ్లకుండా నేడు మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతీ ఇంటికి నీళ్లు వస్తున్నాయన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఒక్క గింజ ధాన్యం కొనుగోలు చేయలేదన్నారు. రైతులకు ఇబ్బంది కలగకుండా ప్రతి గింజనూ కొనుగోలు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, ఎంపీపీ కొత్త పుష్పలతకిషన్‌రెడ్డి,



మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

ఉపసర్పంచ్ మాధవిస్వామి, ఎంపీటీసీ మమతరాజిరెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ జ్యోతికృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ కై లాష్, బక్కి వెంకటయ్య, యాదిగిరి, స్వామి, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధిలో ముందంజ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఆలయాల అభివృద్ధిలో సిద్దిపేట జిల్లా ముందంజలో ఉందని మంత్రి హరీశ్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీ ఉమాపార్థీవ కోటిలింగాల ఆలయ ఆవరణలో రూ.50లక్షలతో నిర్మాణం కానున్న ధ్యాన మందిరం నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సిద్దిపేట నియోజకవర్గం ఆలయాల అభివృద్ధిలో అద్వితీయమన్నారు. సిద్దిపేట నలుదిక్కులా ఉన్న పురాతన ప్రాచీన ఆలయాలకు రూ.25కోట్లతో పూర్వవైభవం తెచ్చామన్నారు. కోటిలింగాల ఆలయం అద్భుతంగా అభివృద్ధి చేసుకుందామని, ఆలయం ఎన్నో ఏళ్ల ప్రాచుర్యం కలిగిన గొప్ప పుణ్య క్షేత్రమని కొనియాడారు.

కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎంపీ ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాకరూరల్: మండంలోని పర్సరాంనగర్, అచ్చుమాయిపల్లి, కమ్మర్‌పల్లి గ్రామాల్లో ఎంపీ నిధులతో ముదిరాజ్, అంబేడ్కర్, వెలుమ, రెడ్డి, యాదవ, వంజరి కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి ఎంపీ ప్రభాకర్‌రెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేసిందన్నారు. గత పాలకులు ఏ కులాన్ని పట్టించుకోలేదన్నారు. సీఎం కేసీఆర్ కృషితోనే సబ్బండ కులాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. ఎమ్మెల్యే రఘునందన్‌రావు తప్పుడు హామీలు ఇస్తూ నియోజకవర్గ ప్రజలను మోసం చేశాడన్నారు. ఇక ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని తరిమికొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, ఎంపీపీ పుష్పలతకిషన్‌రెడ్డి, ఎంపీటీసీ రాంరెడ్డి, సర్పంచ్‌లు స్వప్నస్వామి, నర్సయ్య, ఉపసర్పంచ్ దేవరాజ్, ఏఎంసీ చైర్మన్ జ్యోతికృష్ణ, వైస్‌చైర్మన్ పద్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు సౌకర్యంగా రోడ్లు



పనులు ప్రారంభిస్తున్న కమిషనర్ గణేశ్‌రెడ్డి, కౌన్సిలర్ యాదమ్మ

దుబ్బాకటౌన్: మున్సిపాలిటీలో ప్రజలకు సౌకర్యంగా ఉండేలా రోడ్లను అభివృద్ధి చేస్తున్నామని కమిషనర్ గణేశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని 12వ వార్డులో కౌన్సిలర్ బట్టు యాదమ్మఎల్లం ఆధ్వర్యంలో రైతులు వ్యవసాయ పొలాలకు వెళ్లే దారిలో పెరిగిన ముళ్లపొదలు తొలగించి రోడ్డు చదును చేసే పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పొలాల వద్దకు వెళ్లేందుకు రోడ్డు సక్రమంగా లేకపోవడం ముళ్లచెట్లు పెరగడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతుల కోరిక మేరకు ఈ రోడ్డును బాగు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు, వార్డు ప్రజలు, రైతులు తదితరులు ఉన్నారు.

అర్హుల గుర్తింపు వేగవంతం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల

సిద్దిపేటజోన్: ప్రధానమంత్రి ఆవాస యోజన పథకం ద్వారా పట్టణంలో అర్హులైన వారి గుర్తింపు ప్రక్రియ వేగవంతం చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరాజనర్సు సూచించారు. మంగళవారం మున్సిపల్ సమావేశ మందిరంలో కౌన్సిల్ అత్యవసర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిరుపేద ప్రజలకు గూడు కల్పించే దిశగా అడుగులు వేద్దామని సూచించారు. 35 గజాల స్థలం ఉన్న వారికి నూతన ఇంటి నిర్మాణం కోసం ఆర్థికసాయం చేస్తారని అన్నారు. అనంతరం 10 అంశాలను మున్సిపల్ పాలకవర్గం సభ్యులు ఆమోదించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కనకరాజు, మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్లు రవి, శ్రీనివాస్ యాదవ్, బ్రమ్మం, సుందర్, మల్లికార్జున్, విఠోభ, కవిత, బాల్‌లక్ష్మి, రేణుక, శ్రీదేవి, కవిత, నజియా, తస్లీమ్ తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్ నేతల దాడి సరికాదు'

గజ్వేల్‌రూరల్: అధికార పార్టీకి చెందిన నాయకులు చేస్తున్న అవినీతి, అక్రమాలపై ప్రశ్నించిన కాంగ్రెస్ నేతలపై దాడులు సరికాదని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్ మండిపడ్డారు. హన్మకొండలో ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ చేస్తున్న అవినీతి, అక్రమాలపై కాంగ్రెస్ నాయకులు తోట పవన్ ప్రశ్నించినందుకు ఎమ్మెల్యే తన అనుచరులతో దాడి చేయించడాన్ని ఖండిస్తూ మంగళవారం గజ్వేల్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ప్రీతం ఆదేశాల మేరకు సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బాలకృష్ణారెడ్డి, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శి కొప్పు రవి, నాయకులు కృష్ణారెడ్డి, రవీందర్, బ్రహ్మం పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం

హుస్నాబాద్: వరంగల్‌లో జరిగిన హాథ్ సే హాథ్ జోడో కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నేత పవన్‌పై



సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

బీఆర్‌ఎస్ నాయకులు చేసిన దాడిని స్థానిక యూత్ కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఇందుకు నిరసనగా మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు విద్యాసాగర్, మండల అధ్యక్షుడు పోచవేని శ్రీశైలం, నాయకులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో ఉద్యమించాలి



భగత్‌సింగ్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

చేర్యాల(సిద్దిపేట): భగత్‌సింగ్ స్ఫూర్తితో యువత ఉద్యమించాలని సీపీఎం మండల కార్యదర్శి కొంగరి వెంకట్‌మావో పిలుపునిచ్చారు. రెడ్ బుక్ డే సందర్భంగా భారత విప్లవ కెరటం భగత్‌సింగ్ పుస్తకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. కమ్యూనిస్టు కార్యకర్తలందరూ భగత్‌సింగ్ పుస్తకాన్ని పఠించి మతోన్మాద, కార్పొరేట్ శక్తుల కుట్రలను తిప్పికొట్టి భగత్‌సింగ్ కలలుగన్న స్వేచ్ఛ స్వాతంత్ర్యం, జన విముక్తిని సాధించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు రాళ్లబండి నాగరాజు, పోలోజు శ్రీహరి, నాగపురి కనకయ్య, కత్తుల భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బాలు, కుమార్, హస్గర్, మల్లేశం, కనకయ్య, శోభ తదితరులు పాల్గొన్నారు.

కొమురవెల్లి(సిద్దిపేట): భగత్‌సింగ్ స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని సీపీఎం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి అన్నారు. మంగళవారం సీపీఎం కార్యాలయంలో విప్లవ కెరటం భగత్ సింగ్ పుస్తకాన్ని పార్టీ సీనియర్ నాయకులు నక్క యాదవరెడ్డితో కలసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కృష్ణారెడ్డి, రాంసాగర్ సర్పంచ్ తాడూరి రవీందర్, నాయకులు మల్లేశం, బాలకిషన్, శ్రీనివాస్, కృపాకర్, నరేశ్, మహేశ్, శ్రీనివాస్, రామ్‌రెడ్డి, శ్రవణాచారి పాల్గొన్నారు.

పురాతన ఆలయానికి పూర్వవైభవం

నేటి నుంచి మూడురోజుల పాటు ఉత్సవాలు



శిథిలావస్థకు చేరిన శివాలయం

నంగునూరు(సిద్దిపేట): చోళరాజుల కాలంలో పాలమాకులలో నిర్మితమైన శంభు ఆలయం శిథిలావస్థకు చేరడంతో నూతన ఆలయం కట్టించి పూర్వవైభవం తేవాలని ఎన్నాళ్ల నుంచో గ్రామస్తులు కోరుతున్నారు. నాటి నుంచి నిత్య పూజలందుకుంటున్న శంభు దేవుడు ఎంతో మహిమాన్వితుడు కావడంతో జీర్ణోద్ధారణతో జీవం పోయాలని ద్వివేది జనమంచ సీతాశర్మ, పూజారి చిత్తారిశర్మలు సంకల్పించారు. వారి కోరిక మేరకు మంత్రి హరీశ్‌రావు కృషి ఫలితంగా రాష్ట్ర పురాతన ఆలయాల పునరుద్ధరణ ట్రస్ట్ వారు ఆలయ నిర్మాణానికి ముందుకు రావడంతో గ్రామస్తుల కల సాకారం కానుంది.

బాలాలయంలో విగ్రహ ప్రతిష్ఠ..

బుధవారం నుంచి మూడురోజుల పాటు శంభుదేవుడి బాలాలయ ప్రతిష్ఠ, నూతన ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన మహోత్సవం నిర్వహించనున్నారు. మొదటిరోజు గురువందనం, వేదస్వస్తి, వరుణాయనం, పంచగవ్యం, అగ్నిస్థాపనం, అఘోర మంత్రాది హవనం, అవధారయలు, గురువారం మహాస్నాపనం, ప్రసాదవాస్తు, మూలమంత్ర హవనం, శోవన్యాసం, శుక్రవారం వేదస్వస్తి, శంభు ఆలయ శంకుస్థాపన, యాగ మండప దేవతా హవనం, బాలాలయంలో విగ్రహ స్థాపన, జయాదులు, బలిప్రదానం, పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహిస్తామని సీతారామశర్మ తెలిపారు.

ఘనంగా మాతృభాషా దినోత్సవం



దుబ్బాకటౌన్: జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ వనిత



చేర్యాల(సిద్దిపేట): వివిధ వేషధారణలో విద్యార్థులు

దుబ్బాకటౌన్: తల్లి లాంటి తెలుగు భాషను మరిస్తే అమ్మను మరచినట్లేనని దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత భూంరెడ్డి అన్నారు. మంగళవారం లచ్చపేట మోడల్ స్కూల్‌లో అంతర్జాతీయ తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మాతృభాష తెలుగును కాపాడుకోవాల్సిన అవసరం చాలా ఉందన్నారు. తెలుగు భాష పరిరక్షణకు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు సైతం కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో భాషా ప్రయోగశాలను ప్రారంభించారు. భాష ప్రయోగశాలలో 111 మంది కవుల చిత్ర పటాలను తెలుగు పండిట్ షేక్‌చాంద్, ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు బహూకరించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, ఉపన్యాస పోటీలు, కవితలు, పద్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంపీపీ కొత్త పుష్పలత కిషన్‌రెడ్డి, ఎంఈఓ ప్రభుదాసు, కౌన్సిలర్ నందాల శ్రీజశ్రీకాంత్, ఏఎంసీ చైర్మన్ జ్యోతికృష్ణ, ప్రిన్సిపాల్ సుప్రియ తదితరులు ఉన్నారు.

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని వేచరేణి గ్రామ ఉన్నత పాఠశాలలో మంగళవారం మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం కె.వి.ఎన్.రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయుడు రామచంద్రామూర్తి సహకారంతో విద్యార్థులు పలువురు ప్రాచీన, ఆధునిక కవుల వేషధారణలో తెలుగు భాష గొప్పదనాన్ని వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని సికింద్లాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వేడుకలు నిర్వహించారు. మాతృభాషకు సంబంధించి ఉపన్యాసం, పద్యపఠనం, కథల పోటీ, చిత్ర లేఖనం వంటి పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. మాతృభాష గొప్పదనాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం రజిత, ఉపాధ్యాయులు తిరుపతి, సరిత, శ్రీనివాస్, మాధవీలత తదితరులు పాల్గొన్నారు. అలాగే అనంతసాగర్, రామంచ, చిన్నకోడూరు పాఠశాలల్లో మాతృభాష దినోత్సవం నిర్వహించారు.

గజ్వేల్‌రూరల్: ప్రజలు ఏ ప్రాంతంలో ఉన్నా తమ మాతృభాషను మరవొద్దని గజ్వేల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శార్వాణి అన్నారు. మంగళవారం పట్టణంలోని బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లో గల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు మాతృభాషా గొప్పతనాన్ని వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ శార్వాణి మాట్లాడుతూ.. సంస్కృతి, సంప్రదాయాలకు నెలవుగా మాతృభాష నిలుస్తుందని, దీనిని కాపాడుకోలేకపోతే తమ ఉనికికే ప్రమాదమేర్పడే అవకాశముందన్నారు. మాతృభాష కోసం నలుగురు బెంగాలి యువకులు ప్రాణాలర్పించిన నేపథ్యంలో 2000 ఫిబ్రవరి 21న అంతర్జాతీయ మాతృభాష దినోత్సవంగా ఐక్యరాజ్య సమితి ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. కార్యక్రమంలో తెలుగు శాఖ అధ్యాపకురాలు ఉమారాణి, మృణాళిని, అధ్యాపకులు కస్తూరి, మంజుల, డాక్టర్ పి.జయరాజు, విద్యార్థినులు పాల్గొన్నారు.

పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలి



రైతులకు మందులు అందిస్తున్న జిల్లా అధికారి జగత్‌కుమార్, తదితరులు

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని తాడూరులో మంగళవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పశువులకు వచ్చే గర్భకోశ వ్యాధి, సుడి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా పశువైద్య, పశు సంవర్థకశాఖ అధికారి డాక్టర్ జగత్‌కుమార్, వెటర్నరీ ఏడీ ఎస్.రాజిరెడ్డి, మండల పశువైద్యుడు విజయసారథి, జేవీఓ మనోహర్, ఎల్ఎస్ఏ సిద్దయ్య, విజయ పాల ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్ నరేశ్, సెక్రటరీ బాల్‌రాజు, తిరుపతిరెడ్డి, గోపాల మిత్రలు వెంకట్‌రెడ్డి, సాయిలు, మురళీ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అక్కన్నపేట(హుస్నాబాద్): పశువులకు గాలికుంటు వ్యాధి సోకుండా పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలని, ముందు జాగ్రత్తతోనే వ్యాధి నివారణ సాధ్యమని జెడ్పీ వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజిరెడ్డి అన్నారు. అక్కన్నపేట మండలం అంతక్కపేట గ్రామంలో మంగళవారం జిల్లా పశువైద్య, పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులు గ్రామాల్లో నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ప్రతి ఏటా పశువులకు రోగాలు రాకుండా ముందు జాగ్రత్త చర్యగా ఉచితంగా టీకాలను పంపిణీ చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఇర్రి లావణ్యారాజిరెడ్డి, పశుసంవర్థక సిబ్బంది డాక్టర్ వెంకట్‌రెడ్డి, పశువైద్యాధికారి విజయ్‌భార్గవ్, ఎంపీటీసీ రజిత, పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ హామీలను విస్మరిస్తున్న ప్రభుత్వాలు

దుబ్బాక: కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అవినీతి పాలన పేద ప్రజలపై శాపంగా మారాయని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి మండిపడ్డారు. మంగళవారం హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా రాయపోల్ మండలం వీరారెడ్డిపల్లి, బేగంపేట్, అప్పాయిపల్లి గ్రామాల్లో ఇంటింటా తిరుగుతూ ప్రజల కష్టాలను తెలుసుకున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను సీఎం కేసీఆర్ విస్మరించి పేద ప్రజలను మోసం చేశాడని దుయ్యబట్టారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అమ్మేస్తూ దేశాన్ని దోచుకుంటున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఇందిరమ్మ రాజ్యాన్ని తిరిగి తీసుకొస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కనకయ్యయాదవ్, నరేందర్‌రెడ్డి, భూపతిరావు, సుధాకర్, స్వామి, దుర్గాప్రసాద్, తదితరులున్నారు.

◆ సీఎంఆర్‌ఎఫ్ నిరుపేదలకు వరం

మద్దూరు(హుస్నాబాద్): సీఎంఆర్‌ఎఫ్ రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం లాంటిదని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నాగపూరి కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని మర్మాముల గ్రామానికి చెందిన ఊట్ల అనిల్‌రెడ్డికి మంజూరైన 55వేల చెక్కును మంగళవారం బాధిత కుటుంబ సభ్యులకు కిరణ్‌కుమార్ అందజేశారు.

రాయపోల్‌లో..

దుబ్బాక: రాయపోల్ మండల పరిధిలోని ఎల్కల్ గ్రామానికి చెందిన కనకయ్య ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.57వేలు, నర్సింలుకు రూ.28వేలు, సత్తయ్యకు రూ. 27వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మంగళవారం రాయపోల్ మండల బీజేపీ అధ్యక్షుడు మాదాస్ వెంకట్‌గౌడ్ బాధితులకు అందజేశాడు.

◆ ఆర్థికసాయం

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని సలాఖపూర్ గ్రామానికి చెందిన తరిగొప్పుల ఎల్లయ్య అనారోగ్యంతో మరణించగా మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి బాధిత కుటుంబానికి రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు

◆ సాయన్నను విస్మరించడం సరికాదు

గజ్వేల్: కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్న అంత్యక్రియలను అధికారిక లాంఛనాలతో నిర్వహించకపోవడం సరికాదని ఎంఎస్పీ రాష్ట్ర నాయకుడు గజ్జెల భిక్షపతి మాదిగ, మైస రాములు మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి ముంద్రాతి కృష్ణలు అన్నారు. మంగళవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. సినీనటులు, వ్యాపారవేత్తలు మరణిస్తే అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించి, నిరంతరం ప్రజాసేవకే అంకితమైన సాయన్నను విస్మరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సమావేశంలో ఎంఎస్పీ నాయకులు పోతగల్ల లింగం, ఎమ్మార్పీఎస్ గజ్వేల్ ఇన్‌చార్జి ఉబ్బని ఆంజనేయులు, నాయకులు కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

◆ నష్టపరిహారం చెక్కుల అందజేత

దుబ్బాక: దౌల్తాబాద్ మండల పరిధిలోని అప్పాయిపల్లి గ్రామంలో కిష్టసాగర్ కెనాల్ ప్రాజెక్ట్ కాల్వ కింద భూములు నష్టపోయిన 12 మంది రైతులకు ప్రభుత్వం నుంచి మంజూరైన చెక్కులను మంగళవారం దౌల్తాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సుజాత చేతుల మీదుగా చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది మధు, రాజేశ్వర్, సర్పంచ్ సుగుణయాదగిరి, ఎంపీటీసీ వీరమ్మమల్లేశం, తదితర నాయకులు ఉన్నారు.

◆ ఐఏఎస్ వెంకట్ నర్సింహారెడ్డికి మాతృవియోగం

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఐఏఎస్ వెంకట్ నర్సింహారెడ్డికి మాతృవియోగం కలిగింది. వెంకట్‌రెడ్డి తల్లి జనాభాయి(75)మంగళవారం మృతి చెందారు. ఆమె కొన్ని రోజుల క్రితం గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. తన స్వగ్రామమైన జగదేవ్‌పూర్‌కు మృతదేహాన్ని తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, టీఎస్ ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ప్రభాకర్, గజ్వేల్ ఏసీపీతో పాటు పలువురు అధికారులు ఐఏఎస్ వెంకట్ నర్సింహ్మారెడ్డిని పరామర్శించి సానుభూతి తెలిపారు.

◆ అభివృద్ధి పనులకు సహకరించండి

మద్దూరు(హుస్నాబాద్): మద్దూరు, దూళ్మిట్ట మండలాల్లో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని మద్దూరు ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డి మంగళవారం మంత్రి హరీశ్‌రావును కలిసి వినతిపత్రం అందించారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి హరీశ్‌రావును ఎంపీపీ కృష్ణారెడ్డి కలిసి మండలంలో అభివృద్ధి పనులపై చర్చించారు. ఎంపీపీ వెంట బీఆర్‌ఎస్ నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

◆ మురికి కాల్వల్లో దోమల మందు పిచికారీ

దుబ్బాకటౌన్: పట్టణంలోని 16వ వార్డులో దోమల బెడద తీవ్రం కావడంతో మంగళవారం కౌన్సిలర్ దేవుని లలితచంద్రయ్య స్వయంగా వార్డులో తిరుగుతూ.. మురికి కాల్వల్లో సిబ్బందితో కలిసి దోమల మందు స్ప్రే చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడడమే లక్ష్యమన్నారు.

దుబ్బాక: వార్డు పరిశుభ్రతే లక్ష్యంగా కృషి చేస్తానని కౌన్సిలర్ దుబ్బాక బాలకృష్ణగౌడ్ అన్నారు. దుబ్బాక మున్సిపల్ పరిధిలోని ధర్మాజీపేట వార్డులో దోమలను నివారించడానికి రూ.20వేలతో దోమల మందు పిచికారీ యంత్రాన్ని కొనుగోలు చేసి పారిశుధ్య కార్మికులకు 8వ వార్డు కౌన్సిలర్ బాలకృష్ణగౌడ్ అంజేశారు. ప్రజలు పరిసరాల పరిశుభ్రతకు సహకరించాలని కోరారు.

◆ ఐక్య పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం



మాట్లాడుతున్న లింగారెడ్డి

హుస్నాబాద్: సంఘాల ఐక్య పోరాటాల ద్వారానే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం అవుతాయని డీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగారెడ్డి అన్నారు. మండలంలోని వివిధ పాఠశాలలను మంగళవారం సందర్శించి అనంతరం జరిగిన ఉపాధ్యాయుల సమవేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు పొదుపు చేసుకున్న డబ్బుల నుంచి వారి అవసరాల నిమిత్తం విత్‌డ్రా చేసుకోవడానికి దరఖాస్తు చేసుకుంటే 6 నెలల వరకు కూడా మంజూరు కావడం లేదన్నారు. సరెండర్ లీఫ్‌లో కూడా క్యాష్ ఆలస్యం అవడం, పీఆర్సీ, డీఏ, ఏరియల్స్ సక్రమంగా జమ కావడం లేదన్నారు. పాఠశాలల్లో తాగునీరు, పరిశుభ్రత కోసం నిధులను కేటాయిస్తూ స్కావెంజర్లను నియమించాలని కోరారు. సీఎం కేసీఆర్ జోక్యం చేసుకొని ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి 398 ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని లింగారెడ్డి కోరారు. సమావేశంలో వివిధ పాఠశాలల హెచ్ఎంలు శంకర్, రేఖారాణి, ఉపాధ్యాయులు మోహన్‌రెడ్డి, భాస్కర్, రవీందర్, భాస్కర్, కుమారస్వామి, రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

◆ ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పూర్ణాహుతిలో పాల్గొన్న గ్రామస్తులు

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని గాగ్గిళ్లాపూర్ గ్రామంలో గల త్రిశూలేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మంగళవారం అర్చకులు తాటికొండ ఆగాచారి, వైదిక నిర్వహణలో ప్రాతకాల సమయంలో పంచామృతాలతో గణపతి, సుబ్రమణ్యస్వామి, అమ్మవార్లకు విశేషపూజలు, సహస్ర నామార్చన, అభిషేకాలు చేశారు.